సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు: జేసీ

పార్వతీపురం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు జేసీ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో వచ్చే రెవెన్యూ, ఇతర సమస్యల వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్, డీపట్టా, రీసర్వే, 22ఏ, రెవెన్యూ సర్వీసులపై చెక్‌లిస్టు తయారు చేసుకుని ఆ మేరకు అర్జీలను స్వీకరించాలని సూచించారు. ఈ విధంగా చేయడం వల్ల సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయని తెలిపారు. డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

● ఉమ్మడి జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎన్నెన్నో అందాలు..


శిఖపరువు జలపాతం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నో చారిత్రక ప్రసిద్ధ ప్రదేశాలు.. క్షేత్రాలు.. సుందరమైన ప్రాంతాలు ఉన్నాయి. ఇటు విజయనగరం జిల్లా కేంద్రంలోని పైడితల్లి ఆలయంతో పాటు రామతీర్థం వంటి పుణ్యక్షేత్రాలు ఇక్కడి చరిత్రకు ఆనవాలుగా నిలుస్తున్నాయి. విజయనగరం, బొబ్బిలి రాజుల కోటలు.. మన్యంలోని సుందర ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అటు పర్యాటకులూ ఆహ్లాదంగా గడపడానికి అవకాశం ఉంటుంది. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని కథనం..

మన్యం.. సుందర దృశ్యాల నిలయం

సాలూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీ సుందర దృశ్యాలకు నిలయం. ప్రకృతి అందాలను పర్యాటానికి అనువుగా తీర్చిదిద్దితే స్థానికులు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి.. సందర్శకులను ఆకట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. మన్యంలో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని గతేడాది డిసెంబర్ 20న సాలూరు మండలం సిరివర రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో, డిసెంబర్ 21న అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ ప్రకటన పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చితే ఏజెన్సీకి మంచి రోజులు వచ్చినట్టే. సాలూరు మన్యం అందాలు పర్యాటకులను మురిపిస్తాయి. సాలూరు మండలంలో శిఖపరువు, దళాయివలస, దండిగాం, కురుకూటి, లొద్ద జలపాతాలు ఉన్నాయి. కొరియా కొండల అందాలు ప్రత్యేకం. కొరియా నుంచి ఒడిశాలోని దేవ్‌మాలి, తోలోమాలికి గిరిశిఖర అందాలు తిలకించేందుకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నాయి. సాలూరు మండలం లక్ష్మీపురం వద్ద వెంగళరాయసాగర్, పాచిపెంట మండలం పెద్దగెడ్డ రిజర్వాయర్ ఉన్నాయి. వీటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దవచ్చు. పెద్దగెడ్డ వద్ద బోట్ షికారు ఉండేది. ప్రస్తుతం రిజర్వాయర్ల వద్ద బోట్ షికార్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ ప్రాంతంలో గతంలో అనేక సినిమాలు రూపుదిద్దుకున్నాయి. సినిమాల చిత్రీకరణకు వీలుగా సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుంది. లొద్ద జలపాతానికి పర్యాటకులు వెళ్లేందుకు వీలుగా ఆరు కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సాలూరుకు సమీపాన పారమ్మకొండ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి అనువుగా ఉంటుంది. దీనిపై ప్రభుత్వ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


కొరియా అందాలు

చారిత్రక ప్రాంతం.. పర్యాటకానికి దూరం

బొబ్బిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో అనేక సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. కానీ వీటి అభివృద్ధికి ప్రభుత్వాలు చూపుతున్న చొరవ అంతంతమాత్రమే. స్థానిక రాజుల ఇలవేల్పు వేణుగోపాలస్వామి ఆలయాన్ని, కోట, గెస్ట్‌హౌస్‌లను

(మిగతా 8వ పేజీలో..)


బొబ్బిలి యుద్ధస్తంభం

మహాలక్ష్మి అలంకరణలో 8లో
కోటదుర్గమ్మ



ప్రజలకు మెరుగైన 8లో
సేవలు అందించాలి
● సబ్ కలెక్టర్ వైశాలి

లారీ ఢీ కొని 7లో
12 మేకల మృతి

గురుకుల పాఠశాల 8లో
విద్యార్థిని మృతి

సిరిమాను పండుగకు 72 మంది
అదనపు సిబ్బంది

పరామర్శకు వెళ్లొస్తూ..
● బస్సు కిందపడి వృద్ధురాలి మృతి 7లో

నేడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

● బరంపురం నుంచి సూరత్ వరకూ వెళ్లనున్న రైలు
● పలాస, శ్రీకాకుళంరోడ్, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రైల్వేస్టేషన్లలో హాల్ట్
● ఉత్తరాంధ్ర ప్రజలకు తీరనున్న కష్టాలు



పార్వతీపురం/పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరనుంది. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి సూరత్ వరకూ ప్రత్యేక రైలు పట్టాలెక్కనుంది. శనివారం బరంపురం రైల్వే స్టేషన్ వద్ద అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ రైలు బరంపురం నుంచి సూరత్ వరకూ రాకపోకలు సాగిస్తుంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రైల్వేస్టేషన్లలో హాల్ట్ కల్పించారు. సూరత్, రాయపూర్, బిలాయ్, అహ్మదాబాద్, గాంధీదామ్ ప్రాంతాల్లో ఉత్తరాంధ్రకు చెందిన అనేక మంది పనిచేస్తున్నారు. వీరు ఆ ప్రాంతాలకు వెళ్లడానికి రైలు సౌకర్యం ఉన్నా పూర్తిస్థాయిలో బెర్త్‌లు దొరక్క జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటి నుంచో గుజరాత్ వరకూ ప్రత్యేక రైలు వేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అమృతభారత్ రైలు కొత్తగా వేయడంతో ఆ కష్టాల నుంచి గట్టెక్కగలమని భావిస్తున్నారు. అమృత్ భారత్ రైలు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ మీదుగా ప్రయాణిస్తూ వస్త్ర, వాణిజ్య కేంద్రాలను అనుసంధానం చేయనుంది. దీనిద్వారా ఆర్థిక, పారిశ్రామిక చైతన్యం పెంపొందించవచ్చని రైల్వేశాఖ భావిస్తోంది.

● అమృత్ భారత్ రైలు (09022)ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారు. మరుసటి రోజు

(మిగతా 8వ పేజీలో...)

మూడో రైల్వే లైన్‌లో
ట్రయల్ రన్ విజయవంతం



పార్వతీపురం/బెలగాం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం-డొంకినవలస మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వే లైన్‌లో శుక్రవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ట్రయల్ రన్, అమృత భారత్ పనులను సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది వాల్తేర్ డివిజన్‌కు మరో మైలురాయి అని తెలిపారు. ఈ ప్రాంతంలోని రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయని వెల్లడించారు. 36 కిలోమీటర్ల మేర డొంకినవలస, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్లు కలుపుతూ

(మిగతా 8వ పేజీలో...)

ఆరోగ్యకరమైన జీవన శైలితో
వ్యాధులు దూరం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

సీతానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవన శైలితో వ్యాధులను దూరం చేసుకోవచ్చని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. శుక్రవారం పెదభోగిలిలో నిర్వహించిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ముందుగా ఎంతమంది వైద్య సేవలు వినియోగించుకున్నారో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమ వివరాలు ఆన్‌లైన్ నమోదుపై సిబ్బందిని ప్రశ్నించారు. వచ్చేనెల 2 వరకు కొనసాగనున్న ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. సరైన జీవన శైలి, ఆహార నియమావళి, వ్యాయామం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు, సురక్షిత నీరు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, వైద్యురాలు ఉషారాణి, సీహెచ్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.



కరెన్సీ నోట్లతో కనులపండువగా..

సాలూరు, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాలూరు పట్టణంలో కామాక్షి అమ్మవారిని రూ.4 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం సాలూరుతో పాటు పరిసర ప్రాంత భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి.. కామాక్షి అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గిరిజన బిడ్డకు జాతీయ అవార్డు

● భూగోళ పరిశోధనల్లో ప్రతిభ

సాలూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూగోళ పరిశోధనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన బిడ్డకు ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ఖరాసవలస పంచాయతీ పరిధి కొమ్మవానివలసకు చెందిన సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ జాతీయ భూగోళశాస్త్ర లైఫ్‌టైం అచీవ్‌మెంట్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాష్ట్రపతి భవన్ సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డును అందుకున్నారు. కొమ్మవాని వలసలో సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించిన శ్యామ్‌కుమార్ ఏయూలో భూగోళ శాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం అక్కడే జియాల జిస్ట్‌గా కొలువు సాధించారు. ప్రస్తుతం ఆయన సీనియర్ జియాలజిస్ట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో కాపర్, నికెల్, కోబాల్ట్,గోల్డ్ వంటి వ్యూహాత్మక, కీలక ఖనిజ ఆవిష్కరణ అన్వేషణలో ఉత్తమ ప్రతి భ కనబర్చడంతో 2024-2025 ఏడాదిగాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. భారత భూగోళ పరిశోధన సంస్థ (జీఎస్ఐ) మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ భూగోళ శాస్త్రవేత్తలకు అందించే ఈ అవార్డుకు మన్యం వాసి ఎంపికవడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న శ్యామ్‌కుమార్

మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలి

● అధికారులకు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పార్వతీపురం, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసే వారికి విధిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. అటవీ ప్రాంతం మీదుగా జరిగే మత్తు అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా పెట్టాలి. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వల్ల కలిగే చెడు ప్రభా వాలపై గ్రామ స్థాయిలో, విద్యా సంస్థలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ విషయంలో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి.' అని తెలిపారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 17 కేసుల్లో 40 మందిని అరెస్టు చేశామని, 2,054 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. 16 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమానంగా ఉండే దుకాణాలు, వాహనాలపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ ఎం.రాంబాబు, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఎఫ్‌వో ప్రసూన, జిల్లా రవాణా అధికారి దుర్గా ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పక్కన ఎస్పీ, జేసీ

మారిషస్‌తో అధిక దిగుబడులు

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్


మారిషస్ పైనాపిల్ పంటను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మారిషస్ రకం పైనాపిల్ సాగుతో అధిక దిగుబడులు సాధించవొచ్చునని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం బిల్లగూడ, ఇప్పగూడ గ్రామాల్లో పైనాపిల్ పంటను పరిశీలించారు. సాగు విధానాన్ని గిరిజన రైతులను అడిగి తెలుసుకున్నారు. జీడి, మామిడి పునరుద్ధరణ పథకంలో భాగంగా అధిక దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు ఇన్‌చార్జి పీవో తెలిపారు. వచ్చే ఏడాది సీతంపేట, భామిని మండలాల్లోని ఈతమానుగూడ, కీసరజోడు, బిల్లగూడ, పాలిష్‌కోట, నల్లరాయిగూడ, మనుమకొండ గ్రామాల్లో మామిడిని ప్రయోగాత్మకంగా సాగుచేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రతి చెట్టుకూ దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం తురాయిపువలస ఉద్యాన నర్సరీని పరిశీలించి.. అంటుకట్టే విధానాలను అడిగి తెలుసుకున్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

ఐటీడీఏ పరిధిలోని గురుకులాలకు సరఫరా చేసే కూరగాయలు, అరటిపండ్లు, చికెన్ సరఫరాలో

(మిగతా 8వ పేజీలో...)

---

2 నుంచి తోటపల్లిలో
బ్రహ్మోత్సవాలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలు బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో అక్టోబరు 2 నుంచి 5 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దసరా పండుగ రోజు సాయంత్రం 6 గంటలకు బ్రహ్మోత్సవాలు (పవిత్రోత్సవాలు) ఘనంగా ప్రారంభమవుతాయన్నారు. 5న నాగావళి నదీ తీరంలో స్వామివార్లకు చక్రతీర్థస్నానాలు నిర్వహిస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.



పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు 7లో

ప్రాజెక్టులను
పూర్తి చేయండి
● అసెంబ్లీలో ఎమ్మెల్యే విజయచంద్ర

ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

నెల్లిమర్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను తెరిపించి, లోపల గదుల్లో ఉంచిన ఈవీఎంలను పరిశీలించారు. ఏడు నియోజకవర్గాలకు చెందిన గదులను తనిఖీ చేసి, అనంతరం సీళ్లను వేయించారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో కీర్తి, అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలు

శృంగవరపుకోట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు ఎస్.కోట ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి అక్టోబరు 1 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000224642, 7207880690, 9475354647 నెంబర్లను సంప్రదించాలన్నారు.

● రాజాం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో కొత్తగా చేరేందుకు రెండో విడత షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్వప్న హైందవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈనెల 29 నుంచి అక్టోబరు 1 వరకూ వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉందని, అక్టోబరు 3 వరకూ వెబ్ ఆప్షన్లు మార్పు చేసుకోవచ్చని వివరించారు. 6న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని, 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

గాంధీ జయంతి రోజున 157 మొక్కలు నాటాలి

రాజాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా అక్టోబరు 2వ తేదీ నాటికి 157 మొక్కలు నాటాలని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు అన్నారు. శుక్రవారం రాజాం పట్టణంలో మున్సిపాలిటీ కమిషనర్ జె.రామప్పలనాయుడు అధ్యక్షతన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాదరావు, శీమకుర్తి ప్రసాదరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంకి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణికంఠకు అంత్యక్రియలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలోని ఏయూ క్యాంపస్‌లో ఈనెల 25న వింజమూరి వెంకట సాయి మణికంఠ (25) అనే విద్యార్థి గుండె పోటుతో మృతిచెందాడు. విజయనగరంలోని దాసన్నపేట ఓరుగంటి వీధికి చెందిన ఈ విద్యార్థి ఏయూలో బీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం స్థానిక రోటరీ స్వర్గధామంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆయాల జీతాలు చెల్లించాలి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు జీతాలు చెల్లించాలని ఆయా ఏజెన్సీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో మాణిక్యంనాయుడుకు వినతిపత్రం అందజేశారు.

రేపు రారవే సమావేశం

రాజాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజాం రచయితల వేదిక 128వ సమావేశం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో 28వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని వేదిక నిర్వాహకుడు గార రంగనాధం ఒక ప్రకటనలో తెలిపారు. భాషాభిమానులు, సాహిత్యాభిమానులు, రచయితలు అందరూ హాజరు కావాలని కోరారు.

వైద్యుల తీరుపై గిరిజనుల మండిపాటు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బొడ్డవర లోకేటడ్ పీహెచ్‌సీ వైద్యుల తీరుపై గిరిజనులు మండిపడ్డారు. గిరిశిఖర పంచాయతీ దారపర్తి మదుర గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించాల్సి ఉండగా.. మైదాన ప్రాంతమైన బొడ్డవర పంచాయతీ దబ్బగుంటలో తూతూ మంత్రంగా నిర్వహించడం ఏంటని పలువురు గిరిజనులు ప్రశ్నించారు. గిరిజన గ్రామాల్లో సంపూర్ణ వైద్య సేవలు అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తోటపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.త్రినాథ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వే స్టేషన్ రోడ్డు, బొత్స పేట, బ్యాంకు కాలనీ, బాలాజీనగర్, నర్సింహా నగర్, సాయినగర్, నాయుడు కాలనీ, చాకలివీధి, షిర్డీ కాలనీ, గాయత్రీ కళాశాల, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారని చెప్పారు.

ఆడబిడ్డ నిధి అమలుపై కార్యాచరణ

● మంత్రి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో భాగమైన ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. శుక్రవారం శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. '18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు ఉన్న మహిళల్లో అర్హులకు నెలకు రూ.1500 వంతున ఆర్థిక సాయం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా.. గత ప్రభుత్వం మోపిన లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం ఉన్నా.. హామీల అమలుపై ఆ ప్రభావం పడకుండా చూస్తున్నాం. 2014-19 మధ్యలో పసుపు, కుంకుమ పేరిట మహిళలకు ఆర్థిక సాయం చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకున్నాయి. ఇప్పుడు పూర్తి స్థాయిలో కార్యాచరణ రూపొందించి.. ఆడబిడ్డ నిధి పథకాన్ని కూడా అమలు చేస్తామ'ని మంత్రి చెప్పారు.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయండి

● ఎస్.కోట ఎమ్మెల్యే లలిత కుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలిత కుమారి

కొత్తవలస/ఎస్.కోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస, శృంగవరపుకోట కోర్టులకు సంబంధించి నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ రెండు కోర్టులకు సంబంధించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. కొత్తవలస కోర్టుకు సంబంధించిన విధులు స్థానికంగా న్యాయాధికారి నివాసం కోసం నిర్మించిన భవనంలో సాగుతున్నాయని తెలిపారు. ఎస్.కోట కోర్టును ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారని చెప్పారు.

ప్రాజెక్టులను పూర్తి చేయండి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పార్వతీపురం జిల్లాలో రెండు మేజర్, మూడు మైనర్ సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు కోసం రూ.40 కోట్లు ఖర్చుపెడితే 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. జిల్లాలోని ప్రాజెక్టులకు రూ.200 కోట్లు ఖర్చు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరారు.

దేవదాయ భూములు లేవు

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు సంబంధించిన భూ సమస్యలపై శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రస్తావించారు. రాజాం పరిసర ప్రాంత గ్రామాలలో దేవదాయ శాఖకు సంబంధించిన ఎలాంటి భూములు లేవన్నారు. 1941- 44 ప్రోపర్టీ రిజిస్ట్రేషన్‌లో ఒక్క ఎకరా కూడా దేవదాయ శాఖకు సంబంధించిన భూములు లేవని తెలిపారు. 1959లో బొబ్బిలి ఎస్టేట్‌ను, అక్కడి 150 ఎకరాలను అప్పటి అసిస్టెంట్ సెటిల్‌మెంట్ అధికారి దేవదాయ శాఖ కింద నమోదు చేశారన్నారు. ఆ ప్రాంతంలో 7 శాతం వరకు ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు.

బాధితులతో సానుకూలంగా వ్యవహరించండి

● ఎస్పీ దామోదర్



చీపురుపల్లి పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

చీపురుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఎస్పీ ఎస్.రాఘువులు, సీఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన గరివిడి స్టేషన్‌ను సందర్శించారు. ● నెల్లిమర్ల: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సందర్శించారు. పోలీసుస్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశా రు. ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులతో మర్యా దపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

చురుగ్గా ఓహెచ్‌బీఆర్ ట్యాంకుల నిర్మాణం

వేపాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న ఓహెచ్‌బీఆర్ ట్యాంకుల నిర్మాణం చురుగ్గా సాగుతోందని పథకం ప్రోజెక్టు ఇంజనీర్ సీహెచ్ గోవింద తెలిపారు. మండలంలోని చామలా దేవి అగ్రహారం గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ట్యాంకును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలోని 302 గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.90కోట్లు మంజూరు చేయగా, జీఎస్టీ మినహా రూ.63 కోట్లతో ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని 99 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకుగాను బొద్దాం, పోతనాపల్లి, లక్కవరపుకోటలలో ట్యాంకుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రామస్వామిపేట, గోల్డ్ స్టార్, అప్పన్నపాలెం గ్రామాలలో ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. చామలా దేవి అగ్రహారం గ్రామం వద్ద ట్యాంకు నిర్మాణం నాణ్యతతో చేపడుతున్నారని ఆయన చెప్పారు.

అసెంబ్లీకి రాని వారికి జీతాలు ఎందుకు?



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా అడుగుతున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డితో పాటు, రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి విజయం సాధించిన పది మంది వైసీపీ ఎమ్మెల్యేలకు జీతాలు, రాయితీలు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకు రావాల్సిన ఎమ్మెల్యేలు సమావేశాలకు రాకుండా గైర్హాజరు కావడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా మెగా డీఎస్సీలో విజయం సాధించి న అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన నేప థ్యంలో ఆయా అభ్యర్థుల్లో ఆనందం కనిపించిందన్నారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం పట్ల నిరుద్యోగ అభ్యర్థుల్లో హర్షం వ్యక్తమవుతున్నదన్నారు. జిల్లా నుంచి మరింత మంది డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందేలా నిఖిల కలిశెట్టి ఫౌండేషన్ ద్వారా బెస్ట్ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను విజయనగరంలో ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. టీడీపీ నాయకుడు విజ్ఞ ప్రసాద్ పాల్గొన్నారు.

సిరిమాను పండుగకు 72 మంది అదనపు సిబ్బంది

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమాను సంబరానికి దేవదాయశాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నది. జాతరలో అన్ని రకాల సౌకర్యాల కల్పనతో పాటు దేవదాయ శాఖ పరంగా పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని దేవదాయశాఖ సిబ్బందితో పాటు శ్రీకాకుళం, విశాఖపట్టణం, పార్వతీపురం-మన్యం జిల్లాల పరిధిలో ప్రముఖ దేవాలయాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారుల నుంచి సిబ్బందికి వివిధ రకాల బాధ్యతలు అప్పగించేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రస్తుత సిరిమాను ఉత్సవానికి పనిచేసే సిబ్బందితో పాటు అదనంగా 72 మందిని విజయనగరం అమ్మవారి ఉత్సవాల్లో వివిధ రకాల బాధ్యతలు అప్పగించనున్నారు. అక్టోబరు 6న తొలేళ్లు, 7న సిరిమానోత్సవం నేపథ్యంలో రెండురోజులు పాటు దేవదాయశాఖ నిర్వహించే వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని నియమించనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు.

ఘనంగా హజరత్ బాబా ఖాదర్ వలీ జయంతి



వేడుకల్లో పాల్గొన్న ఖలీల్‌బాబు తదితరులు

విజయనగరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సూఫీ సామ్రాట్ హజరత్ బాబా ఖాదర్ వలీ సహిన్‌షా 129వ జయంతి ఉత్సవాలను బాబామెట్టలోని ఖాదర్ బాబా దర్గాలో ముతావలీ ఖలీల్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబాకు ప్రీతి పాత్రమైన ఫకీర్‌మేళా, పులివేశాలు, డప్పువాయిద్యాలతో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున దర్గాకు చేరుకున్నారు. మధ్యాహ్నం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఖాదర్‌బాబాకు ప్రత్యేక చాదర్, సుగంధ గులాబీలను నిర్వహించారు. దర్బార్‌లో భారీ కేక్‌కట్ చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఖాదర్ బాబా దర్బార్ ముతావల్లీ డాక్టర్ ఖలీల్‌బాబు, ఖాజామోహిద్దీన్, రవి, భవానీ, నారాయణరావు, రంగారావు, బాబా భక్తులు పాల్గొన్నారు.

హకథాన్ పోటీల్లో ఎంవీజీఆర్ విద్యార్థుల ప్రతిభ



హకథాన్ పోటీల్లో విజయం సాధించిన ఎంవీజీఆర్ విద్యార్థులు

డెంకాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నేషనల్ స్మార్ట్ ఇండియా హకథాన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఐహెచ్-2025 పేరిట శుక్ర వారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 120జట్లు పాల్గొనగా 50 జట్లు విజేతగా నిలిచి జాతీయ వేదిక పోటీల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి. ప్రిన్సిపాల్ డా.వైఎంసీ శేఖర్, వేదిక సమన్వయకర్త వంశీకృష్ణ, ఆర్.రమేష్, ఐఐసీ అధ్యక్షుడు శివ సుబ్రహ్మణ్యం, కన్వీనర్ పవన్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

విజయనగరం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులపై జీఎస్టీని తగ్గించడం హర్షణీయమని డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి, జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రతి నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలపై నెలకు సగటున రూ.15వేలు ఆదా కానుందన్నారు.

అవగాహన కార్యక్రమాలు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గుదల నేపథ్యంలో వివిధ వర్గాల వారికి చేకూరనున్న ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు, చేపట్టాల్సిన కార్యచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈనెల 29 వరకూ ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలు అనే కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారం చేపట్టాలన్నారు. అలాగే ఈనెల 30నుంచి వచ్చే నెల 6వరకూ వ్యవసాయం, ఇతర వృత్తులవారికి ప్రయోజనం చేకూర్చే వారికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అక్టోబరు 7 నుంచి 17 వరకూ మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారితకు లబ్ధి పొందే అంశాలపై చైతన్యం కల్పించాలన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకూ వికాస్, విశ్వాస్ పేరిట నమ్మకమైన అభివృద్ధి అనే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తాం

● జిందాల్ నిర్వాసితులు



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 98 రోజులుగా ఎంతో శాంతియుత పోరాటం చేస్తున్న తమకు ప్రభుత్వం, అధికారుల నుంచి ఎటువంటి మద్దతు లేదని.. ఈ సమయంలో తమకు ఇక నిరాహార దీక్షలే శరణ్యమని జిందాల్ నిర్వాసితులు అన్నారు. శుక్రవారం వారు బొడ్డవరలో మాట్లాడుతూ జిందాల్‌కు తమ భూములు అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేశారని, తమకు జిందాల్ షేర్లు దొడ్డిదారిన ఇచ్చారని, ఇంకా తమకు ఈ యాజమాన్యం నుంచి ఎంతో రావాల్సి ఉందని పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మక్కువ గ్రామానికి చెందిన బుడుమూరు రవి(40) స్థానిక గజాలఖానా సమీపంలోని మామిడి తోటలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ప్రయోగమూర్తి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. మృతుడి వద్ద వాటర్ బాటిల్, పురుగు మందు డబ్బా, సెల్‌ఫోన్ లభ్యం కావడంతో వాటి ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. రవి, లక్ష్మీలకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపానికి గురైన రవి ప్రతి రోజూ సాయంత్రం మద్యం తాగి బాధపడుతూ ఉండేవాడు. ఇటీవల భార్యాభర్తలు అంపిలి సమీపంలోని ఓ ఇటుక బట్టీలో రోజువారీ కూలీలుగా చేరారు. గురువారం సాయంత్రం అనారోగ్యంగా ఉందని, పాలకొండ వెళ్లి వస్తానని భార్యకు చెప్పి రవి వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. చివరికి స్థానిక గజాలఖానా సమీపంలోని మామిడి తోటలో విగతజీవిగా కనిపించాడు. పిల్లలు లేరని బాధతోనే భర్త మృతి చెందాడని భార్య లక్ష్మి పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మానవత్వం చాటిన పోలీసులు



మృతదేహాన్ని దుప్పటితో మోసుకు వస్తున్న పోలీసులు

పాలకొండ ఎస్ఐ ప్రయోగమూర్తి మానవత్వాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వచ్చేసరికి మృతదేహాన్ని తోట నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు వాహనం రావడానికి వీలు లేకపోవడంతో స్వయంగా ఎస్ఐ మృతదేహాన్ని సిబ్బందితో కలిసి దుప్పటిలో ఎత్తుకుని ప్రధాన రహదారికి చేర్చారు.

పరామర్శకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

భామిని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాలాడ గ్రామంలో బంధువుల పరామర్శకు వచ్చిన ఓ మహిళ బస్సు ఢీకొన్న ఘటనలో మృతిచెందింది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రంలోని కొదమ గ్రామానికి చెందిన కోన మహాలక్ష్మి(68) శుక్రవారం తాలాడ వచ్చింది. తన బంధువుల్లో ఒకరు చనిపోతే పరామర్శించేందుకు వచ్చింది. తిరిగి తన స్వగ్రామం వెళ్లేందుకు అత్తి కొత్తూరు సెంటర్‌లో బస్సు కోసం ఆమె నిరీక్షించింది. బస్సు రాగానే వెంటనే ముందుకు వెళ్లింది. దాంతో బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తిలి హెచ్‌సీ సంగమేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుర్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలంలోని దమరసింగు గ్రామానికి చెందిన పిన్నింటి సత్యనారాయణ(27) నాలుగు రోజుల కిందట ఇంటి వద్ద పెళ్లి విషయంలో మనస్థాపం చెంది పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. సత్యనారాయణ రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది పరీక్షల్లో పాసై ఉద్యోగం సాధించాడు. ఇంతలోనే పెళ్లి విషయం ఏమీ తేల్చుకోలేక ఇబ్బందులు పడుతూ తీవ్ర మనస్థాపానికి గురై, ఆత్మహత్య పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి అన్నయ్య, వదిన, నాన్న ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

బొబ్బిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వెంగళరాయని చెరువులో గురువారం గల్లంతైన వర్రి మధు(25) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఏఎస్ఐ కొండలరావు అందించిన వివరాల మేరకు.. గురువారం స్నానం చేసేందుకు చెరువుకు వెళ్లిన మధు గల్లంతయ్యాడు. తండ్రి దాడయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టినా మధు ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం మరోసారి చెరువులో గాలించగా మధు మృతదేహం లభ్యమైంది. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నలు ఉన్నారు.

శిశువు మృత్యువాత

● రెల్లివలస పీహెచ్‌సీ వద్ద కుటుంబీకుల ఆందోళన



మృత శిశువుతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

పూసపాటిరేగ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ శిశువు మృతి చెందిందని రెల్లివలస పీహెచ్‌సీ వద్ద బాధిత కుటుంబీకులు శుక్రవారం ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చల్లవానితోట గ్రామానికి చెందిన వి.రాధిక నిండు గర్భిణి. ఆమెకు గురువారం రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో భర్త సన్యాశిరావు వెంటనే రెల్లివలస పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. అయితే అక్కడి సిబ్బంది ఆమెను రాత్రి ఆసుపత్రిలోనే ఉంచి.. ఉదయం 7గంటలకు ప్రసవం చేసే గదిలోకి తీసుకువెళ్లారు. వైద్యాధికారిణి కాసేపటిలో వస్తారంటూ కాలయాపన చేశారు. వేరే ఆసుపత్రికి తీసుకువెళ్తామంటే తీసుకు వెళ్లనివ్వలేదని సన్యాశిరావు తెలిపారు. క్లిష్ట పరిస్థితిలో 108కి ఫోన్ చేయగా, ఆ సిబ్బంది వచ్చి వారు బిడ్డను తీసేశారు. ఉదయం 9గంటలకు వైద్యాధికారిణి వచ్చారు. అయితే తల్లీ బిడ్డను 108 వాహనంపై విజయనగరం ఘోషాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. దీంతో మృత శిశువును పట్టుకుని రెల్లివలస పీహెచ్‌సీ వద్ద కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందినట్లు వారు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని, వారికి నచ్చజెప్పారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ● దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి భాగ్యరేఖ మాట్లాడుతూ శిశువు మెడకు పేగు చుట్టుకు పోవటంతో పాటు మరి కొన్ని కారణాల వల్ల ప్రసవానికి ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. 108 వాహన సిబ్బంది వచ్చి ప్రసవం చేయకపోతే తల్లికి కూడా ప్రాణాపాయం సంభవించేదని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మహిళా పోలీసుస్టేషన్‌లో గత ఏడాది నవంబరులో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించినట్టు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. దీనిపై ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలం జమ్మునారాయణపురంలోని ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటున్న తరిణీ అప్పారావు(54) అదే అపార్టుమెంటులో నివాసం ఉంటున్న ఓ బాలికను గత ఏడాది నవంబరు 13న తన ఇంట్లోకి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ పద్మావతి పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయగా, అప్పారావుపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి కె.నాగమణి శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితురాలికి పరిహారంగా రూ.3లక్షలు మంజూరు చేస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ గోవిందరావు, హెచ్‌సీ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ సూరపనాయుడు, స్పెషల్ పీపీ జి.సత్యంలను ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత అభినందించారు.

లారీ ఢీకొని 12 మేకల మృతి

భామిని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పసుకుడి సమీపంలో శుక్రవారం ఉదయానికి లారీ ఢీకొని 12 మేకలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన గంట వెంకటరావు ఉదయానికి మేకలు మేపేందుకు తీసుకుని వెళ తుండగా విశాఖ నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ మేకల మందపైకి దూసుకెళ్లింది. దాంతో 12 మేకలు మృతిచెందాయి. దాంతో పెంపకందారుడు కన్నీరు మున్నీరయ్యాడు. స్థానికులు చేరుకుని లారీ యజమానితో గ్రామపెద్దలు సంప్రదించారు. బాధితుడికి నష్టపరిహారం అందించే ఏర్పాటు చేశారు.

ఎన్నెన్నో అందాలు

(ఐదో పేజీ తరువాయి)

చూసేందుకు సందర్శకులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ అనేక సినిమాలు చిత్రీకరణ జరుపుకున్నాయి. కోటలో యువరాజు, ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన ఆయుధాలు, రాజుల బంగారు, వెండి సింహాసనాలు తదితర వాటితో మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఇక్కడ మరో సందర్శనీయ స్థలం బొబ్బిలి యుద్ధ స్మారక స్థూపం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం ఇక్కడ సుమారు రూ.30 లక్షలు వెచ్చించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనిని ఆనుకొని ఉన్న భైరిసాగరం చెరువులో బోటు షికారుకు ప్రతిపాదనలు చేశారు. ఇవి ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో గల మల్లమ్మ చెరువు (కోనేరు)లో బోటు షికారును ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కూడా పర్యాటక శాఖ బుట్టదాఖలు చేసింది. బొబ్బిలి పట్టణంలో వీణల తయారీ కేంద్రం ప్రసిద్ధి గాంచింది. చేనేత వస్త్రాలు, ఇత్తడి, కంచుతో తయారుచేసే హస్తకళల కళాకారులకు ఈ ప్రాంతం నిలయం. స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో సుమారు రూ.పది లక్షలు వెచ్చించి 2010లో హస్తకళల అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అవి వృథాగా పడి ఉన్నాయి. బొబ్బిలి-సాలూరు పట్టణాల మధ్య రెండు రైలు బస్సులు నడిపేవారు. వీటిలో ప్రయాణించేటప్పుడు మార్గమధ్యలో పచ్చని పంటపొలాలు, కొండలు, నదులు ఆహ్లాదాన్ని అందించేవి. కొవిడ్ సమయం నుంచి ఈ రైలుబస్సును నిలుపుదల చేశారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతగా కోరుకున్నా రైల్వే అధికారులు ససేమిరా అన్నారు. ప్రభుత్వ దృష్టిసారిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఈ ప్రాంతీయులు చెబుతున్నారు.

నేడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

9 గంటలకు సూరత్(ఉద్నా)కు చేరుకుంటుంది. పార్వతీపురం మీదుగా సుంగర్‌పూర్‌రోడ్, మునిగుడ, కేసింగి, కాంటాబంజి, ఖరియా రోడ్, మహాసముంద్, లఖోలి, బద్ధియా, రాయగడ, నాగపూర్, బుసావల్ వంటి రైల్వేస్టేషన్ల గుండా ప్రయాణిస్తుంది. ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో తయారు చేసిన ఈ రైలు సీటింగ్ ఏర్పాటు, మెరుగైన సౌకర్యాలు కల్పించారు. మొత్తం 22 కోచ్‌లు ఉండే ఈ రైలులో 11 జనరల్ సెకండ్‌క్లాస్ సిటింగ్ కోచ్‌లు, స్లీపర్ క్లాస్‌కోచ్‌లు, రెండు సెకండ్ క్లాస్-లగేజీ వ్యానులు, ప్యాంట్రీకార్ పొందుపరిచారు.

మూడో రైల్వే లైన్‌లో ట్రయల్ రన్ విజయవంతం

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన మూడో లైన్‌ను పూర్తిగా పరిశీలించామని తెలిపారు. ఇది రాయగడ-విజయనగరం మార్గంలో డబ్లింగ్‌లో భాగంగా ఉందన్నారు. అనంతరం స్టేషన్‌యార్డ్ క్రాస్ ఓవర్లు, హైలెవెల్ ప్లాట్‌ఫాంలు, వంతెనలతో పాటు కొత్తగా అందించిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కన్‌స్ట్రక్షన్ అంకుష్ గుప్తా, చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మారిషస్‌తో అధిక దిగుబడులు

(5వ పేజీ తరువాయి)

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ హెచ్చ రించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. టెండర్‌దారులు నిబంధనలు పాటించాలన్నారు. సకాలంలో ఆహారపదార్థాలను సరఫరా చేయాలని సూచించారు. ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, జీసీసీ బీఎం కృష్ణ, ఇన్‌చార్జి ఏటీడబ్ల్యూవో సూర్యనారాయణ, గురుకుల కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అప్రంటీస్ శిక్షణకు అభ్యర్థుల ఎంపిక పూర్తి

పార్వతీపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రంటీస్ శిక్షణకు అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపికైన అభ్యర్థులు పనిపై దృష్టి పెట్టి శిక్షణను పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థు లకు నియామక పత్రాలను అందజేశారు. వారిని జిల్లాలోని వివిధ డిపోలకు కేటాయించారు.

మద్రాస్ ఐఐటీలో వృత్యంతర శిక్షణకు ప్రిన్సిపాల్

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ఐఐటీలో వృత్యంతర శిక్షణకు గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం వెళ్లారు. ఈ శిక్షణలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన, టెక్నాలజీ వాడకం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన కోర్సులు తదితర అంశాలపై ఐఐటీ ప్రొఫెసర్లు శిక్షణ ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

కొమరాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. భోజన పథకం నిర్వాహకులో ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకుల కమిటీ ప్రతినిధులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

బయో కేంద్రాలను బలోపేతం చేయండి

గరుగుబిల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని బయో శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు సూచించారు. శుక్రవారం తోటపల్లి జట్టు సంస్థ శిక్షణ ప్రాంగణంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ విధానాలతో తయారు చేసిన ద్రావణాలను రైతులు వినియోగించేలా వారికి చైతన్యవంతులను చేయాలన్నారు.కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్ పి.ప్రవీణ్ కుమార్, కిరణ్, సత్యనారాయణ, జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు ఏపీవో ఈశ్వరమ్మ, ఈసీ డి.తేజేశ్వర రావు శుక్రవారం పరిశీలించారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. శ్మశానవాటికల్లో సరిహద్దులను క్రమబద్ధీకరించి కంచె మాదిరిగా వెదురు ప్లాంటేషన్ చేయనున్నామన్నారు. పరిశీలనలో టెక్నికల్ అసిస్టెంట్ జగదీశ్ ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

మక్కువ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంబరలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాన్ని నిర్వహించారు.ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పౌష్టికాహారం, పోషణ విలువలు ఉపయోగాలపై వివరించారు. బాలింతలు, గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలమమ్మ, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త సూర్యకాంత పాల్గొన్నారు.

ఆహార కల్తీకి పాల్పడితే జైలుకే..

బొబ్బిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తినుబండారాల షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార కల్తీకి పాల్పడితే చట్టపరంగా శిక్షిస్తామని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీకి పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఇంతవరకు 28 కేసులను నమోదు చేసి, రూ.7.50 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. జేసీ కోర్టు, ఇతర కోర్టుల్లో కేసులు పెడుతున్నామన్నారు. ప్రస్తుతం 18 కేసులు కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



సాలూరులో పారమ్మతల్లి అవతారంలో



గరుగుబిలిలో అమ్మవారు



శంబరలో పోలమాంబ



రామాపురం కాలనీలో..

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రామాపురం కాలనీలోని ఏర్పాటైన మండపంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కొత్తవలస నవదుర్గ ఆలయంలోని అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

●గరుగుబిల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ గ్రామాల్లో ఏర్పాటైన మండపాల్లో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంతో పాటు రావుపల్లి, నాగూరు, శివ్వాం, రావివలస, పెద్దూరు, తదితర గ్రామాల్లో కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●సాలూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం భక్తులకు పారమ్మతల్లిగా దర్శనమిచ్చారు. తొలిసారిగా అమ్మవారిని పారమ్మతల్లి అవతారంలో దర్శన భాగ్యం కల్పించడంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సుబ్బ గురువు పర్యవేక్షణలో రుత్వికుడు వినయశర్మ పారమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పంచముఖేశ్వర ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు.

●మక్కువ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంబరలోని పోలమాంబ ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ఐదోరోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కె.శ్రీనివాస్‌శర్మ పూజలు నిర్వహించారు.

●పాలకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్‌శర్మ పూజలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అర్చకులు మణీలశర్మ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో మహాలక్ష్మీ అవతారంలో కోటదుర్గమ్మ

ఆర్‌ఎస్‌ఈటీఐ నిర్మాణానికి స్థల పరిశీలన

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిలా కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్మాణానికి శుక్రవారం జేసీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం స్థానికంగా ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిన విషయం తెలిసిందే. విదితమే. అందులో భాగంగా పార్వతీపురం మండలం కొత్తవలసలో ఆర్‌ఎస్‌ఈటీఐ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన భూమిని తీసుకునేందుకు మండ రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు

మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైశాలి

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రతి ఉద్యోగి నాణ్యమైన సేవలు అందించాలని సబ్ కలెక్టర్ డాక్టర్ వైశాలి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎల్లప్పుడూ ఉద్యోగులు అందుబాటులో ఉండాలన్నారు. వారికి ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు. ఆమెతో పాటు తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

తాళ్లడుమ్మ వీఆర్‌వోపై క్రమశిక్షణ చర్యలు

జియ్యమ్మవలస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లడుమ్మ వీఆర్వో శీర బంగారిపై శుక్రవారం తహసీల్దార్ వై.జయలక్ష్మి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నా రు. కలెక్టర్ కార్యాలయానికి వీఆర్వోను సరెండర్ చేశారు. వీఆర్వో బంగారి విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు మద్యం తాగి విధులకు హాజరవుతున్నారనేది ప్రధాన అభియోగాలని తహసీల్దార్ తెలిపారు. అలాగే సచివాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు చేస్తే గడువు ముగిసేంతవరకు దానిని ఫార్వర్డ్ చేయకపోవడం, మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మద్యం తాగి రావడం, భూ సమస్యలను పట్టించుకోకపోవడం తదితర ఆరోపణలు అతడిపై ఉన్నాయన్నారు.

కోటదుర్గమ్మకు వినతిపత్రం



వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

పాలకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, కార్యదర్శి వండాన కూర్మారావు, బి.సి.నాయుడు తదితరులు కోట దుర్గమ్మవారిని కోరారు. అమ్మవారికి అర్చకుల ద్వారా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇదే అంశంపై కలెక్టర్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే కళావెంకటరావుతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘానికి స్థానికులు మనోభావాలను తెలుపుతూ వినతిపత్రాలు అందిస్తామని సాధన సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు తెలిపారు.

కాజ్‌వేపై వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

మక్కువ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు సమీపంలోని అడారి గెడ్డ కాజ్‌వేపై పేరుకు పోయిన వ్యర్థాలను శుక్రవారం పనసభద్ర సర్పంచ్ సీదరపు గంగమ్మ తొలగించే ఏర్పాటు చేశారు. అడారిగెడ్డ పరివాహక ప్రాంతంలో గత నెలరోజులుగా భారీవర్షాలు కురవడంతో వరదనీటితో వచ్చిన వ్యర్థాలు కాజ్‌వేపై చేరాయి. దాంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో సర్పంచ్ స్పందించారు ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జీఎస్టీ సంస్కరణలు భేష్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగు తుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రతీ కుటుంబానికి రూ.15వేల వరకు ఆదాయం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కిరాణా, ఆరోగ్యం, జీవిత బీమా, దుస్తులు, స్టేషనరీ తదితర వాటి ధరలు అమాంతం తగ్గాయన్నారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజు, టీపీసీ మెంబర్ సవర మాలయ్య, ఏఎంసీ డైరెక్టర్ మూర మోహనరావు, సూర్యారావు, జయలక్ష్మి, మంగయ్య, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణానికి నిధులు

సాలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని 21 గిరిజన గ్రామాల్లో రామాల యాలు నిర్మాణానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాణరెడ్డి నిధులు మంజూరు చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. హిందువులు నివసించే గిరిజన గ్రామాల్లో రామాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గతంలో కోరానన్నారు. దాంతో ఆయన స్పందించి 21 గ్రామాల్లో నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్టు మంత్రి రామనారాయణ తెలి పారని ఆమె తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కురపాం గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మండలంలోని కమ్మగూడ గ్రామానికి చెందిన విద్యార్థిని పువ్వల అంజలి తన స్వగ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఐటీడీపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరైన వైద్యం అందకపోవడమే ఇందుకు కారణమని పలువురు ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం పలా సురేష్ డిమాండ్ చేశారు.

గజరాజులతో గజగజ

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బండిదొరవలస నుంచి కృష్ణపల్లికి వెళ్లే రహదారి వైపు శుక్రవారం రాత్రి రావడంతో గజరాజులు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఏనుగులు గత రెండు రోజులుగా సంచరిస్తున్నాయి. దీని వల్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒక పక్క పంటలు ఏనుగులు ధ్వంసం చేస్తూ నష్టం ఏర్పడుతుంటే మరోపక్క ఏనుగులు వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. తమ గ్రామాల నుంచి ఏనుగులను పంపించే ఏర్పాటు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

ఆర్వోబీల నిర్మాణాలకు ముందడుగు

కొమరాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమినాయుడువలస, గంగరేగువలస గ్రామాల పరిధిలో రైల్వే గేట్ల వద్ద నిర్మాణం చేపట్టనున్న వంతెనలకు సంబంధించి భూసేకరణ అంశంపై గంగరేగువలస సచివాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కోడి తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సభకు తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. వంతెన నిర్మాణాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. వంతెన నిర్మాణాల్లో భూమి కోల్పోనున్న వ్యక్తులకు పరిహారం చెల్లిస్తామన్నారు. రైల్వే ఇంజనీర్ డి.ప్రకాశరావు మాట్లాడుతూ ఆర్వోబీలకు సంబంధించిన మ్యాప్, వివరాలను తెలిపారు. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యుడు గంట వెంకటనాయుడు, టీడీపీ నాయకులు మరడాన తిరుపతిరావు, మరిశర్ల సింహాచలం, సత్యనారాయణ, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త వాహనాల అడ్డగింత

పాలకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ చెత్త వాహనాలను శుక్రవారం లుంబూరు, ఓని తదితర గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. పాలకొండ, ఓని రహదారి మధ్యలో బత్తులవాని చెరువు వద్ద చెత్తను డంపింగ్ చేస్తుండటంపై వారు అడ్డుకుని నిరసన తెలిపారు. దాదాపు 15 గ్రామాల ప్రధాన రహదారిలో చెత్త డంపింగ్ చేయడం ఏంటని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర పాలకులను ప్రశ్నించారు.

డంపింగ్ యార్డును సమస్యను పరిష్కరించాలని వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు.

విశ్రాంతి షెడ్డు ప్రారంభం

పాలకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొట్ట మంగళాపురంలో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి షెడ్డును సర్పంచ్ కరణం బాబ్జీ శుక్రవారం ప్రారంభించారు. ఈ షెడు సీఐటీయూ ఆధ్వర్యంలో 77 మంది దాతల సహకారంతో నిర్మాణమైంది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, పంచాయతీ కార్యదర్శి బి.వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ గొర్లె రవికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మజ్జి వీరనాయుడు, కార్యదర్శి బబ్బాది శివ పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ యత్నం

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్న బండపల్లిలోని ఆలయంలో గురువారం రాత్రి హుండీని చోరీ చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ సంతోష్ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.